## విజయ్ కుమార్ కు పలువురి పరామర్శ



పాల్వంచ, సెప్టెంబరు08(కెరటం ప్రతినిధి)
లి పాల్వంచ పట్టణ కాంగ్రెస్ నాయకులు విజయ్ కుమార్ కాలు ఇటీవల ఫ్రాక్చర్ అయి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. టీపీసీసీ సభ్యులు ఆయన్ని కలిసి ఆరోగ్య పరిస్థితి వాకాబు చేశారు. ఆయన వెంట పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు,బీసీ నాయకులు బొబ్బి శెట్టి. సాంబయ్య, మైనారిటీ నాయకులు ఇమ్మాన్యుయెల్, యువజన కాంగ్రెస్ నాయకులు బొల్లం ఉదయ్ కుమార్, భార్గవ్ ఉన్నారు.

## వరద బాధితులకు 'అపోలో' సాయం

- ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి విరాళం



హైదరాబాద్, సెప్టెంబర్08(కెరటం ప్రతినిధి)
తెలంగాణాలో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ఎన్నో కుటుంబాలు వరదల బారినపడ్డాయి. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. వీరి సహాయార్థం అపోలో హాస్పిటల్స్ తమ వంతుగా కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించింది. ఈ చెక్కును తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగీతా రెడ్డి మాట్లాడుతూ ఈ వర్షాలు ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేశాయన్నారు. వీరి సహాయార్థం తమ వంతుగా ఈ విరాళం ఇచ్చామన్నారు. ఈ సవాళ్ల సమయంలో తెలంగాణ ప్రజలకు అండగా ఉంటామన్నారు. పునర్నిర్మాణ ప్రయత్నాలకు సహకరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

## 'మంకీపాక్స్' తో జాగ్రత్తగా ఉండాలి

### అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మల్లా దేవి వినయ

హైదరాబాద్, సెప్టెంబర్08(కెరటం ప్రతినిధి)
మంకీపాక్స్ తో జాగ్రత్తగా ఉండాలని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మల్లా దేవి వినయ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మంకీపాక్స్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని ఒక ప్రకటన విడుదల చేశారు. మంకీపాక్స్ ను ఇప్పుడు ఎంపాక్స్ అంటున్నారని పేర్కొన్నారు. ఇది ఎంపాక్స్ వైరస్ వల్ల కలిగే వైరల్ జూనోటిక్ ఇన్‌ఫెక్షన్ అన్నారు. ఇది మశూచి వలే దద్దుర్లు కలిగి ఉంటుందన్నారు. వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మరణాలు తక్కువగా ఉన్నాయని, కానీ చిన్న పిల్లలు, గర్భిణులు, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. జంతువు నుంచి మనిషికి.. ఇది సోకిన జంతువుల శరీర ద్రవాలు ఇతరత్రా ద్వారా సోకుతుందన్నారు. ఇక మనిషి నుంచి మనిషికి పుండ్లు, స్కాబ్స్, శరీర ద్రవాలు, శ్వాసకోశ స్రావాల ద్వారా అంటుకుంటుందని తెలిపారు. ఒక వ్యక్తికి ఈ వైరస్ సోకిన తర్వాత లక్షణాలు కనిపించడానికి సాధారణంగా 5 నుంచి 13 రోజులు పడుతుందని పేర్కొన్నారు. అయితే, కొన్నిసార్లు 4 రోజులకు తగ్గవచ్చని, లేదా 21 రోజులకు పెరగవచ్చని తెలిపారు. ఈ సమయం వ్యాధి తీవ్రతపై ఆధారపడి ఉంటుందన్నారు. జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, వెన్నునొప్పి, అలసట ఒకటి నుంచి ఐదు రోజులు ఉంటుందని తెలిపారు.

# 29న మాలల ఆత్మీయ సమ్మేళనం



కొత్తగూడెం, సెప్టెంబరు08(కెరటం ప్రతినిధి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాల మహానాడు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుటకు గాను కొత్తగూడెంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు అల్లాడి.పాలరాజు అధ్యక్షత వహిం చగా ముఖ్య నాయకులు మద్దెల. శివకుమార్ హాజరయ్యారు. ఈ సన్నాహక సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియో జకవర్గాల్లో ఉన్నటువంటి నియోజకవర్గ ఎస్సీ వర్గీకరణ ముఖ్య నాయకుల సలహాలు, సూచనల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు పూల. రవీందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమవుటకు జిల్లాలో ఉన్నటువంటి మాల సోదర సోదరీమణులు అందరినీ చైతన్యపరచుటకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జిల్లాలో ఉన్నటువంటి ఐదు నియోజకవర్గాల్లో ఉన్నటువంటి మాల సోదర సోదరీమణులందరికీ కూడా ఈ నెల అనగా సెప్టెంబర్ 29 ఆదివారం మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొనుటకు తేదీని, స్థలాన్ని సమిష్టి నిర్ణయంతో ఏకాభిప్రాయానికి రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి మాల ఎమ్మెల్యేలు మరియు ఎంపీలను మరియు మాల మేధావులను ముఖ్య అతిథులుగా పిలవాలని నిర్ణయించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మద్దతు ఇచ్చేటువంటి అన్ని వర్గాలను కలుపుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఈ సభ వేదిక నుండి మాలల సత్తా నిరూపిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నటువంటి ఐదు నియోజకవర్గాలు కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లందు అశ్వరావుపేట, పినపాక నుండి ముఖ్య నాయకులు ఆన్ తోటి. పాల్, పగిడిపల్లి. శ్రీకాంత్,పుట్టి. శ్రీనివాస్, సారిక నరసింహ, పుష్పలత, కల్పన, జట్టి. మోహన్, బి.నరేష్, డి. రామారావు, ఇల్లంగి. తిరుపతి బుడిబుడి. ప్రభాకర్, పోతురాజు. రామారావు, బుడిబుడి. ప్రతాప్, కొండల్, పుట్టి. రవి, దేగల.వంశీ, దేగల. పద్మారావు, శివ, ఎన్. వెంకటేష్, ఈశ్వరయ్య, రాజేశ్వరరావు కృష్ణ, పి ఎన్ మూర్తి తదితర మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పూజలో పాల్గొన్న కాపు సీతాలక్ష్మీ దంపతులు



కొత్తగూడెం, సెప్టెంబరు08(కెరటం ప్రతినిధి)
వినాయక చవితి పర్వదినం సందర్భంగా రామవరం 6వ వార్డులో వినాయక మందిరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్, టిబిజికేఎస్ రాష్ట ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, సీతాలక్ష్మీ దంపతులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామవరం 6వ వార్డులో గత 33 సంవత్సరాల నుండి గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ద్విగ్జయంగా చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరికీ మంచి మేలు జరగాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ భక్తిశ్రద్ధలతో వినాయకుని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు, మహిళ సోదరీమణులు, యువకులు భక్తులు పాల్గొన్నారు.

# పెద్ద మనసు చాటుకున్న చిన్నారి...

## వరద బాధితులకు 10 వేలు సాయం





కొత్తగూడెం, సెప్టెంబరు08(కెరటం ప్రతినిధి)
ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో మున్నేరు వాగు ఉప్పొంగి వందలాది మంది నిరాశ్రయులుగా మిగిలారు. వారికి తన వంతు చేయూతనందించి పలువురుకి ఆదర్శంగా నిలిచాడు ఈ చిన్నారి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన మూడ్ విశ్వామిత్ర చౌహాన్ వరద బాధితుల బాధలను ఫోన్ ద్వారా చూసి చెల్లించి పోయారు. తనవంతు సహాయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి 10వేల రూపాయలను అందించారు. నర్సింగ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న తన తల్లి నెల జీతం నుండి చెక్కు రూపంలో విరాళం గా ఇచ్చినట్లు చెప్పారు. కాగా చిన్నారి చేసిన సాయానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రకృతి మిత్ర ఫౌండేషన్ ద్వారా మొక్కలు నాటుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇంత చిన్న వయస్సులోనే ఎంతో పెద్ద మనసుతో ఆలోచన చేసి సాయం చేయడం పట్ల అనేక మంది ప్రశంసించారు.